www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 28 జనవరి 2023
5
పశ్చిమ గోదావరి



29న బొంతు సత్యనారాయణ సంస్మరణ సభ

ప్రజాశక్తి - తణుకురూరల్

కొత్తపాడు మాజీ సర్పంచి, సిపిఎం సీనియర్ నాయకులు బొంతు సత్యనారాయణ సంస్మరణ సభ ఈ నెల 29వ తేది ఆదివారం ఉదయం 10 గంటలకు కొత్తపాడు పంచాయతీ రోడ్డులో చెరువు వద్ద జరుగుతుందని ఆ పార్టీ మండల కన్వీనర్ బి.నాగబాబు, గ్రామ కార్యదర్శి పిల్లి కోటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంస్మరణ సభకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, జిల్లా కార్యదర్శి బి.బలరాం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కామన మునిస్వామి, మాజీ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ, ఇరగవరం ఎంపిపి కొప్పిశెట్టి అలివేలు మంగతాయారు, కొత్తపాడు సొసైటీ ఛైర్మన్ పెన్మెత్స రామభద్రరాజు, సర్పంచి బొక్కా లక్ష్మి, టిడిపి గ్రామాధ్యక్షులు దండు గణపతిరాజు, శ్రామిక మహిళా జిల్లా నాయకులు ఎ.అజయకుమారి, మండల నేతలు పాల్గొంటారని తెలిపారు.

కౌలు రైతులకు రుణం.. రూ.41 కోట్లే..!

ఈ ఏడాది ఏలూరు జిల్లాలో పంట రుణాల లక్ష్యం రూ.7,407 కోట్లు

75 శాతం సాగుచేస్తున్న కౌలురైతులకు రుణాల మంజూరులో దారుణం

57 వేల మందికి కౌలుకార్డుల లక్ష్యంలో 43 వేల మందికే అందజేత

మంజూరైన రుణంలో ఒక్కో రైతుకు రూ.పది వేలు కూడా రాని దుస్థితి



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

వ్యవసాయ సాగులో కీలక పాత్ర పోషిస్తున్న కౌలురైతుల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. ఏలూరు జిల్లాలో కౌలురైతులకు మంజూరైన రుణాలు లెక్కలు చూస్తే కౌలురైతుల పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధి ఏపాటిదో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. పశ్చిమగోదావరి జిల్లాలోనూ ఇదే పరిస్థితి ఉందని తెలుస్తోంది. ఏలూరు జిల్లాలో 28 మండలాలు ఉన్నాయి. జిల్లా వ్యవసాయ సాగులో 75 శాతం వరకూ కౌలురైతులే చేస్తున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. జిల్లాలో పెద్దఎత్తున కౌలురైతులు ఉన్నప్పటికీ కౌలు(సిసిఆర్‌సి)కార్డుల జారీ కింద జిల్లా అధికారులు తీసుకున్న లక్ష్యం కేవలం 57,652 మందికి మాత్రమే. నిర్ధేశించుకున్న లక్ష్యం మేరకైనా కౌలుకార్డులు మంజూరు చేశారా అంటే అదీ లేదు. ఏలూరు జిల్లావ్యాప్తంగా అధికారుల లెక్కల ప్రకారం 43,551 కార్డులు మంజూరయ్యాయి. అంటే నిర్ధేశించుకున్న లక్ష్యం ప్రకారం చూసినా ఇంకా దాదాపు 14 వేల మంది కౌలురైతులకు కార్డులు మంజూరు కాలేదు. కౌలుకార్డులు ఇచ్చిన రైతులకు మంజూరు చేసిన పంట రుణాల లెక్కలు చూస్తే ఔరా అనిపించక మానదు. అధికారుల లెక్కల ప్రకారం ఇప్పటి వరకూ ఏలూరు జిల్లాలో 42,139 మంది కౌలురైతులకు రూ.41.64 కోట్ల రుణం మంజూరు చేశారు. అంటే ఒక్కో రైతుకు రూ.9,882 రుణం ఇచ్చినట్లు లెక్కలు చెబుతున్నాయి. కౌలురైతులు తక్కువగా లెక్కించినా రెండెకరాలు సాగు చేస్తారు. ఎక్కువ మంది మూడెకరాల నుంచి ఐదెకరాల వరకూ సాగుచేసే పరిస్థితి ఉంది. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం చూసినా వరిసాగులో ఎకరాకు రూ.30 వేలకు పైగా పెట్టుబడి అవుతోంది. రెండెకరాలు సాగు చేసే కౌలురైతులకు రూ.పది వేలు కూడా రుణం అందించకపోతే సాగుకు ఏవిధంగా ప్రోత్సాహం ఇచ్చినట్లో ప్రభుత్వమే చెప్పాల్సి ఉంది. ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని రైతాంగానికి రూ.7,407 కోట్లు పంట రుణాలు లక్ష్యంగా ఇవ్వాలని నిర్ధేశించారు. నిబంధనల ప్రకారం పంట రుణాలు అనేవి సాగు చేసే కౌలురైతులకు ఇవ్వాలి. భూయజమానులకు పంటేతర రుణం ఇవ్వాలి. అటువంటి పరిస్థితి మాత్రం లేకుండాపోయింది. రూ.ఏడు వేల కోట్లకు పైగా పంటరుణాల లక్ష్యం కాగా అందులో జిల్లా వ్యవసాయ సాగులో 75 శాతం సాగుచేస్తున్న కౌలురైతులకు ఇచ్చింది కేవలం రూ.41.64 కోట్లు మాత్రమే. దీన్నిబట్టి నిర్దేశించుకున్న లక్ష్యంలో ఎంతశాతం రుణం అందించారో అర్థం చేసుకోవచ్చు.

పెట్టుబడుల కోసం నానావస్థలు


జిల్లా వ్యవసాయ సాగులో కీలక పాత్ర పోషిస్తున్న కౌలురైతులకు పంటరుణాలు అందడం లేదని అధికారుల లెక్కలే చెబుతున్నాయి. దీంతో సాగు పెట్టుబడులకు కౌతురైతులు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. గతంలో రైతులు తాము పండించిన ధాన్యం మిల్లర్లు, కమీషన్ వ్యాపారులకు విక్రయించేవారు. దీంతో తమకు కావాల్సిన పెట్టుబడి అంతా మిల్లర్లు, కమీషన్ వ్యాపారుల నుంచే తీసుకునేవారు. ధాన్యం విక్రయించిన తర్వాత లెక్కలు చూసుకునే వారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలులో కొత్త నిబంధన తెచ్చింది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం అమ్మాలని నిబంధన పెట్టింది. ధాన్యం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తుండటంతో మిల్లర్లు, కమీషన్ వ్యాపారులు రైతులకు పెట్టుబడులు పెట్టడం నిలిపివేశారు. దీంతో కౌలురైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. బ్యాంకుల నుంచి ప్రభుత్వం రుణాలు అందించకపోవడం, మరోపక్క కమీషన్ వ్యాపారులు, మిల్లర్లు పెట్టుబడులు నిలిపివేయడంతో కౌలురైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో ఎన్నడూ లేనంత దారుణంగా ఈ ఏడాది ఇప్పటి వరకూ కేవలం రూ.41.64 కోట్లు మాత్రమే బ్యాంకులు రుణాలు ఇవ్వడంపై కౌలురైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. భూయజమానులను ఒప్పించి కౌలురైతులకు రుణాలిప్పించడంలో జిల్లా వ్యవసాయశాఖ విఫలమైందనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఇదే తీరు కొనసాగితే భవిష్యత్తులో కౌలురైతులు సాగు నుంచి తప్పుకునే పరిస్థితి ఏర్పడనుంది. అదే జరిగితే వ్యవసాయం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయే ప్రమాదం రానుంది. వ్యవసాయ సాగులో కీలక పాత్ర పోషిస్తున్న కౌలురైతులను ఆదుకునే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని అంతా కోరుతున్నారు.

సినీనటి జమున మృతితో విషాదఛాయలు

ఉమ్మడి పశ్చిమగోదావరితో విడదీయరాని అనుబంధం



భీమవరంలో మావుళ్లమ్మ సన్నిధిలో జమునకు సత్కారం (ఫైల్‌ఫొటో)



గోదావరి తీరంలో షూటింగ్‌లో జమున (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - పాలకొల్లు

సినీనటి జమున మృతితో జిల్లాలో విషాదఛాయలు అలుముకున్నాయి. పౌర సన్మానాలతోపాటు కొన్ని షూటింగ్‌ల్లోనూ ఆమె ఈ ప్రాంతంలో పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ తరపున నాటి అత్తిలి నియోజకవర్గంలో ప్రచార సభల్లో పాల్గొన్నారు.

నర్సాపురం పరిసర ప్రాంతాల్లో 1963-64 మధ్యకాలంలో చిత్రీకరించిన మూగమనసులు సినిమా నేటికీ పాలకొల్లు పరిసర ప్రాంత వాసులకు చిరకాల జ్ఞాపకమే. సినీనటులు అంటే మోజుగా ఉండే ఆ రోజుల్లో పాలకొల్లు నుండి మూగమనసులు సినిమా షూటింగ్ చూసేందుకు పెద్దసంఖ్యలో జనం నరసాపురం వెళ్లేవారు. ఆ సినిమాలో అక్కినేని నాగేశ్వరరావుతోపాటు సావిత్రి, జమునలను చూడటానికి పాలకొల్లు నియోజకవర్గం నుంచి ఎక్కువగా వెళ్లేవారు. ఆ చిత్రంలోని నటీనటులకు 1964లో పాలకొల్లు మున్సిపాల్టీ పౌర సన్మానం చేసింది. నాటి దర్శక నిర్మాతలతోపాటు అక్కినేని నాగేశ్వరరావు, సావిత్రి, జమునలకు ఘనంగా పౌర సన్మానం జరిగింది. నాగేశ్వరరావు, సావిత్రి ఇప్పటికే మృతి చెందగా తాజాగా జమున మరణం నాడు పౌరసన్మానంలో పాల్గొన్న విన్నకోట వెంకటేశ్వరరావు, వీరసత్యం, వంగా నరసింహారావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పాలకొల్లుకు చెందిన దర్శకరత్న దాసరి నారాయణరావు దర్శకత్వం వహించిన తాతమ్మ కలలో కూడా జమున కీలకపాత్ర పోషించింది. పాలకొల్లు నటులతో జమునకు సత్సంబంధాలు ఉన్నాయి. ఆమె మృతి పట్ల పాలకొల్లు నాటక కళాపరిషత్ కళాకారులు సంతాపం వ్యక్తం చేశారు.

భీమవరం రూరల్: అలనాటి సినీనటి జమునకు భీమవరం పట్టణానికి ప్రత్యేక అనుబంధం ఉంది. పట్టణంలో మావుళ్లమ్మ అమ్మవారి 52వ వార్షికోత్సవానికి నీరుల్లి, పండ్ల వర్తక సంఘం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జమునను ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. శుక్రవారం ఆమె మతి చెందారని తెలియడంతో ఇటు మావుళ్లమ్మ ఉత్సవ కమిటీ, కళాకారులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు .

జమున మృతికి సిపిఎం సంతాపం

భీమవరం: మహానటి జమున మృతిపట్ల సిపిఎం సంతాపం తెలిపింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.బలరాం ఒక ప్రకటన విడుదల చేశారు. జమున తెలుగు సినీరంగంలో అగ్ర కథానాయకురాలిలో ఒకరిగా వెలుగొందారని, చిత్ర రంగంలో వివిధ రూపాల్లో తెలుగు సినిమా పరిశ్రమలో సేవలందించారని కొనియాడారు. ప్రజలను చైతన్యం చేసే అనేక ప్రజానాట్యమండలి నాటికల్లో ఆమె నటించి ప్రజలను మెప్పించారని కొనియాడారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

పశువుల యజమానులకు ఫైన్లు విధించాలి : కలెక్టర్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో రోడ్లపైకి పశువులు వచ్చి రాకపోకలకు తీవ్ర ఆటంకాలు కలిగిస్తున్నాయని, వీటి కట్టడికి తక్షణం చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. పశువుల యజమానులు నిబంధనలు అతిక్రమిస్తే ఫైన్లు విధించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి శుక్రవారం మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి కలెక్టర్ మాట్లాడారు. రోడ్ల పైకి వచ్చే పశువులకు ఒకటి, రెండుసార్లు స్టాంపు వేయాలని సూచించారు. మొదటిసారి రోడ్డుపైకి వచ్చిన పసువులకు రూ.2 వేలు, అవే పశువులు రెండో సారి కూడా రోడ్లపైకి వస్తే రూ.5 వేలు విధించాలన్నారు. మూడోసారి వచ్చిన పశువుల యజమానులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పందుల పెంపకందారుల యూనియన్ సభ్యులతో మాట్లాడి పందులను ఆవాసాలకు దూరంగా పెట్టుకునే విధంగా చూడాలని ఆదేశించారు. జనావాసాల్లోకి పందులు వదిలేసిన యజమానులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో కబేలాలు సక్రమంగా నిర్వహిస్తున్నారా లేదా వాటిలో పశువులను చంపేటప్పుడు వైద్యులు పరిశీలిస్తున్నారా, లేదా అనుమతులు తీసుకుంటున్నారా లేదా పరిశీలించి నివేదికలు అందించాలని అధికారులను ఆదేశించారు. అనారోగ్యంతో బాధపడుతున్న పశువులన్నింటికీ చికిత్సలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో, మున్సిపాల్టీల్లో కుక్కలకు పిల్లలు పుట్టకుండా నియంత్రణ ఆపరేషన్లు విధిగా చేపట్టాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి మురళీకృష్ణ, డిపిఒ ఎం.నాగలత, పశుసంవర్ధక శాఖ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

ఆధునికీకరణ పనులకు ప్రతిపాదనలు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

గోదావరి డెల్టా ధవళేశ్వరం చీఫ్ ఇంజినీర్ ఆదేశాల ప్రకారం ఫేజ్-2లో భాగంగా అవసరం మేరకు చేపట్టాల్సిన అతిముఖ్యమైన ఆధునికీకరణ పనులకు ప్రతిపాదనలు తయారు చేస్తున్నట్లు ఏలూరు ఇరిగేషన్ ఎస్ఈ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 25న 'ఆధునికీకరణ జరిగేనా' అంటూ 'ప్రజాశక్తి'లో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా డెల్టా ఆధునికీకరణకుగాను మొత్తం రూ.1464.44 కోట్లు మంజూరవ్వగా సుమారు రూ.800 కోట్లు విలువ చేసే పనులు జరిగాయని తెలిపారు. ప్రభుత్వం 2019 మే 29న ఇచ్చిన ఆదేశాల మేరకు పరిపాలనా అనుమతులు లభించి ఇంకనూ ప్రారంభంకాని పనులన్నీ రద్దయినట్లు వివరించారు. 2020 జులై ఎనిమిదో తేదీన జిఒ.365ను అనుసరించి ప్రభుత్వం, గుత్తేదారుల ఉమ్మడి పరస్పర అంగీకారంతో మరికొన్ని డెల్టా ఆధునికీకరణ పనులు ముగిసినట్లు తెలిపారు. డెల్టా ఆధునికీకరణకు సంబంధించి పాక్షిక దశలో ఉన్న కొన్ని పనులను పున:ప్రారంభించడానికి ప్రభుత్వ అనుమతి కోరామని చెప్పారు.

ఉపాధి హామీకి రూ.2 లక్షల కోట్లు కేటాయించాలి

వ్య.కా.స జిల్లా కార్యదర్శి సత్యనారాయణ

ప్రజాశక్తి - భీమవరం

ఉపాధి హామీకి బడ్జెట్లో రూ.2 లక్షల కోట్లు కేటాయించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిఐటియు కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు బాతిరెడ్డి జార్జి అధ్యక్షత వహించగా సత్యనారాయణ మాట్లాడారు. గ్రామాల్లో వరినాట్లు పూర్తయిన తరుణంలో అడిగిన వారందరికీ పనులు కల్పించి రెండు పూటలా మస్తరు విధానాన్ని రద్దు చేయాలని కోరారు. ఇప్పటికే గ్రామాల్లో వ్యవసాయ కార్మికులు విద్యుత్ బిల్లులతో సతమతమవుతుంటే ప్రతి నెలా బిల్లులు పెంచుకోవచ్చని కేంద్ర ప్రభుత్వం చెప్పడం సిగ్గుచేటన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు కె.సోమరాజు, ఎస్.అశ్రియ్య, సహాయ కార్యదర్శులు జె.వెంకటలక్ష్మి, బల్లచిన వీరభద్రరావు, ఎడ్ల చిట్టిబాబు, బి.సూర్యచంద్రరావు, ఎడ్ల మోహన్‌రావు, కె.రమేష్, షేక్ పాదుషా, నరాల శెట్టి రామకృష్ణ, దొంగల నాగేశ్వరరావు, దాసి లాజర్ పాల్గొన్నారు.

పాలనా వికేంద్రీకరణ జరగాలి

మంత్రి బొత్సకు జోగయ్య బహిరంగ లేఖ

ప్రజాశక్తి - పాలకొల్లు

రాష్ట్రం బహుముఖంగా అభివృద్ధి చెందాలంటే పరిపాలన వికేంద్రీకరణ జరగాలని మాజీ మంత్రి, కాపు సేన వ్యవస్థాపకులు చేగొండి హరిరామ జోగయ్య చెప్పారు. ఆయన శుక్రవారం మంత్రి బొత్స సత్యనారాయణకు బహిరంగ లేఖ రాశారు. 3 రాజధానుల మంత్రం జపించినంత మాత్రాన అభివృద్ధి జరగదన్నారు. అమరావతి రాష్ట్ర ప్రజలందరికీ అందుబాటులో ఉందని చెప్పారు. వైసిపి తప్ప ప్రతిపక్షాలన్నీ అమరావతిని పరిపాలనా రాజధానిగా కోరుకుంటున్నాయన్నారు. అమరావతిలో కోట్ల రూపాయల ప్రజాధనం ఖర్చుచేసినట్లు తెలిపారు. అభివృద్ధి వికేంద్రీకరణ ఏరూపంలో జరగాలో, ఏప్రాంతంలో ఏయే ప్రాజెక్టులు నెలకొల్పాలో ప్రత్యేకించి వెనుకబడిన ప్రాంతాలైన ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు అభివృద్ధి పరంగా ఏంచేయాలో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే మంచిదన్నారు.

ఫేస్ యాప్‌తో విఆర్‌ఎలు సతమతం

జెసి మురళికి విఆర్‌ఎల సంఘం వినతి



జెసి మురళీకి వినతిపత్రం అందిస్తున్న గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం నాయకులు

ప్రజాశక్తి - భీమవరం

ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫేస్ యాప్‌తో విఆర్‌ఎలు సతమతమవుతున్నారని గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బుంగ గణేషారావు, పిల్లి సుబ్బారావు చెప్పారు. విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్లో జిల్లా జాయింట్ కలెక్టర్ జెవి.మురళికి, ఆర్‌డిఒ దాసిరాజుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు అనేక సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఫేస్ యాప్ పెట్టమని కొన్ని మండలాల్లో తహాశీల్దార్లు విఆర్‌ఎలపై ఒత్తిడి తెస్తున్నారన్నారు. వృద్ధులు, అనారోగ్యంగా ఉన్న వారు కుమారులను నామినీలుగా పెట్టుకొని పని చేయించుకుంటున్నారన్నారు. ఈ యాప్ వల్ల విఆర్‌ఎలకు అన్యాయం జరుగుతోందన్నారు. ప్రస్తుతం రీ సర్వే వల్ల ఉదయం 8 గంటల నుండి సాయంత్రం వరకూ విధుల్లో ఉండాల్సి వస్తోందని ఈ నేపథ్యంలో ఫేస్ యాప్ వల్ల ఇబ్బందులు వస్తున్నాయన్నారు. నైట్ విధులకు ప్రభుత్వం మినహాయింపు ఇవ్వాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో భీమవరం, నరసాపురం డివిజన్ అధ్యక్షులు బివిఎఎన్ పండు, మోషే, పాపారావు, దుర్గాప్రసాద్, రవి, ఏసురత్నం, రూబమ్మ, మాణిక్యాలరావు, వెంకటరత్నం, శ్రీకాంత్, వెంకటేశ్వరరావు ఉన్నారు.

కలెక్టర్ ప్రశాంతికి సత్కారం




జిల్లా కలెక్టర్ ప్రశాంతిని సత్కరిస్తున్న సభ్యులు

ప్రజాశక్తి - భీమవరం

ఇటీవల రాష్ట్ర గవర్నర్ భిశ్వభూషన్ హరిచందన్ చేతులమీదుగా రాష్ట్రస్థాయి బెస్ట్ ఎలక్ట్రోలర్ ప్రాక్టీస్ అవార్డు అందుకున్న జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతిని శుక్రవారం క్యాంపు కార్యాలయంలో శ్రీవిజ్ఞానవేదిక, పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయం ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, కంతేటి వెంకటరాజు మాట్లాడుతూ విజయవాడలో జరిగిన 13వ నేషనల్ ఓటర్స్ డే సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి రాష్ట్రస్థాయి బెస్ట్ అవార్డు అందుకోవడం గొప్ప విశేషమన్నారు. రానున్న కాలంలో మరెన్నో అవార్డులు సాధించాలని కోరుకుంటున్నామన్నారు. కలెక్టర్‌ను సత్కరించిన వారిలో వసుధ ఫౌండేషన్ కార్యదర్శి ఇందుకూరి ప్రసాద్‌రాజు ఉన్నారు.

కాళీపట్నంతూర్పులో విద్యుత్ సబ్‌స్టేషన్



విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ ప్రసాదరాజు

ప్రజాశక్తి - మొగల్తూరు

నియోజకవర్గ ప్రజలకు కరెంటు సమస్య లేకుండా విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేశామని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాద్‌రాజు అన్నారు. మండలంలోని కాళీపట్నం తూర్పులో రూ.80 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన 5 మెగావాట్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇటీవల నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వ కార్యక్రమాల్లో విద్యుత్ సమస్యను ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. సమస్య పరిష్కారానికి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశామన్నారు. దీంతో కాళీపట్నం తూర్పు, కాళీపట్నం పడమర కొత్తట, ముత్యాలపల్లి, మోడీ, వారతిప్ప, నీటితిప్ప, కోమటితిప్ప, జగన్నాధపురం, పాతపాడు తదితర గ్రామాల్లో లోవోల్టేజ్ సమస్యను అధిగమించవచ్చన్నారు. నరసాపురం నియోజకవర్గం లోని జగనన్న కాలనీవాసులకు 4500 కుటుంబాలకు 2.60 కోట్లతో 33 కెవి ట్రాన్సుర్ ఏర్పాటుకు భూమి పూజ చేశామన్నారు. నియోజకవర్గ స్థాయిలో 133 కోట్లతో 222 కె.వి విద్యుత్ కేంద్రానికి భూమి పూజ చేయనున్నామన్నారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచులు సౌజన్య ప్రభాకర్‌రావు, పడవల సత్యనారాయణ, వైస్ ఎంపిపి కైలా సుబ్బారావు, సొసైటీ ఛైర్ పర్సన్ దొంగ నాగముని, ఎ.చల్లారావు, కౌరు ఆదినారాయణ, కర్రీ ఏసుబాబు, కుక్కల కృష్ణమోహన్ పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు రమణారావు

ప్రజాశక్తి - భీమవరం

రాష్ట్ర ప్రభుత్వం తరలించిన భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నిధులను తిరిగి జమ చేసి సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు నారాపల్లి రమణారావు డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో దాసిరెడ్డి కోటేశ్వరరావు అధ్యక్షతన భవన నిర్మాణ కార్మికుల జిల్లా కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమణారావు మాట్లాడుతూ కార్మికులు కష్టార్జితంతో కూడబెట్టిన సంక్షేమ బోర్డు నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం అవసరాలకు పవర్ ప్రాజెక్టు పేరుతో రూ.450 కోట్లు, ఇతర అవసరాలకు రూ.830 కోట్లు వాడుకుందని, ఆ సొమ్మును జమ చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి గోపాలన్ మాట్లాడుతూ వ్యవసాయ రక్షణ, కార్మిక హక్కులు, పరిరక్షణ ప్రభుత్వ రంగ పరిశ్రమల రక్షణ కోసం ఏప్రిల్ 5న ఢిల్లీలో జరిగే ర్యాలీలో భవన నిర్మాణ కార్మికులు పాల్గొనాలన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మండా సూరిబాబు మాట్లాడుతూ జిఒ నం ఒకటిని వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో పసుపులేటి సత్తిబాబు, మధుసూదన్‌రావు, నూకల సత్తిబాబు, వీరవల్లి మాధవ పాల్గొన్నారు

ప్రజా సంక్షేమమే పరమావధి

ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాధరాజు

ప్రజాశక్తి - ఆచంట

ప్రజా సంక్షేమమే పరమావధిగా.. ప్రతి కుటుంబంలో సంతోషమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందని ఆచంట ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. శుక్రవారం ఆచంట పంచాయతీ పరిధిలోని వెన్నపువారిపాలెం, సరేల్లవారిపాలెం, పడమటిపాలెం, ఎన్‌టిఆర్ నగర్, బాలం వారిపాలెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రంగనాధరాజు మాట్లాడుతూ నాడు చంద్రబాబు ఏ హామీనీ నెరవేర్చకుండా ప్రజలను వంచిస్తే నేడు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రతి కుటుంబానికీ సంక్షేమాన్ని అందించి అండగా నిలిచారని అన్నారు. పథకాలకు ఇంకా ఎవరైనా అర్హులుంటే గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కోట సరోజినీ వెంకటేశ్వరరావు, ఎఎంసి ఛైర్మన్ చిల్లే లావణ్య, వైసిపి రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్‌కుమార్, గ్రామ కమిటీ అధ్యక్షులు పెచ్చెట్టి సత్యనారాయణ, ఎంపిడిఒ జగన్నాధరావు, పంచాయతీ కార్యదర్శి జి.నరసింహారావు, వివిధ శాఖల అధికారులు, గ్రామాల సర్పంచులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

డ్రోన్ వినియోగంపై అవగాహన


ప్రజాశక్తి - పెనుమంట్ర

డ్రోన్ సాయంతో విత్తనాలు, ఎరువులు వేయొచ్చని, పురుగు మందులు, పిచికారీ చేయొచ్చని మార్టేరు వ్యవసాయ పరిశోధన సంస్థ ఎడిఆర్ ఎం.భరతలక్ష్మి అన్నారు. శుక్రవారం సంస్థలో నియోజకవర్గ స్థాయి రైతులు, శాస్త్రవేత్తలకు వ్యవసాయంలో డ్రోన్ వినియోగం, ప్రయోజనాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే జిల్లాలో రెండు డ్రోన్లు అందుబాటులో ఉన్నాయన్నారు. మార్టేరు, అనకాపల్లి వచ్చాయన్నారు. త్వరలో ఆర్‌బికెలో కూడా వీటిని అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. వినియోగించుకునే రైతులు ముందుగా సమాచారం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. వరి ప్రధాన శాస్త్రవేత్త టి.శ్రీనివాస్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మానుకొండ శ్రీనివాస్ మాట్లాడారు.

సోమేశ్వర స్వామి సన్నిధిలో సినీనటి ఆమని

ప్రజాశక్తి - భీమవరం రూరల్

[illegible]లోని ఉమా సోమేశ్వర జనార్దన స్వామిని శుక్రవారం సినీనటి ఆమని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ కోడే విజయలక్ష్మి, ఆలయ కార్యనిర్వహణాధికారి అరుణ్‌కుమార్ ఆమెకు స్వాగతం పలకగా, అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. అనంతరం స్వామివారి ప్రతిమను అందజేశారు.


సినీనటి ఆమనిని సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

30 నుంచి కుష్టు నివారణ పక్షోత్సవాలు

ప్రజాశక్తి - భీమవరం

జాతీయ కుష్టు వ్యాధి నివారణ పక్షోత్సవాల బ్రోచర్లను శ్రీవిజ్ఞాన వేదిక, సెయింట్ మేరీస్ లెప్రసీ సెంటర్ ఆధ్వర్యంలో డిఎంహెచ్‌ఒ కార్యాలయంలో జిల్లా డిఎంహెచ్‌ఒ భానునాయక్ ఆవిష్కరించారు. ఈ నెల 30వ తేదీ నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దేశవ్యాప్తంగా ప్రభుత్వ స్వచ్ఛంద సంస్థల నిర్వహణలో జాతీయ కుష్టు నివారణ పక్షోత్సవాలు నిర్వహిస్తారని జిల్లా అడిషనల్ డిఎంహెచ్‌ఒ. బి.భాను నాయక్ తెలిపారు. కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా కళాశాలలు, పాఠశాలల్లో, కాలనీల్లో పలు అవగాహన, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సెయింట్ మేరీస్ లెప్రసీ సెంటర్ డైరెక్టర్ సిస్టర్ సెలాన్, అడిషనల్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్ ఆకుల పెద్దిరాజు, పిఎంఒ ఎం.రామకృష్ణ, డిపిఎంఒ ఎ.శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యా సామగ్రి అందజేత

ప్రజాశక్తి - పెనుమంట్ర

విద్యార్థుల భవిష్యత్తును ఉపాధ్యాయులే తీర్చిదిద్దాలని కొయ్యేటిపాడు, సత్యవరం మాజీ ఎంపిటిసి కర్రి ఈశ్వర వెంకటరెడ్డి అన్నారు. కొయ్యేటిపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం తన మనవడు కార్తిక్ అక్షరాభ్యాసం సందర్భంగా విద్యార్థులకు విద్యా సామగ్రి, స్వీట్లు, చాక్లెట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం జివి.ధర్మారావు, ఉపాధ్యాయులు టి.గణపతి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణదేవరాయలు జయంతి

ప్రజాశక్తి - పాలకొల్లు

శ్రీకృష్ణదేవరాయలు జయంతి సందర్భంగా శుక్రవారం స్థానిక గాంధీ బొమ్మ సెంటర్లోని ఆయన విగ్రహానికి సీనియర్ కళాకారులు, యువసేన కాపు సంఘం నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాయలకాలం స్వర్ణయుగం అని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వంగా నరసింహారావు చెప్పారు. ఈ కార్యక్రమంలో చవాకుల సూర్యనారాయణ, బండెల భాస్కర్‌రావు, మండెల రజినీ, చేగొండి రంగారావు పాల్గొన్నారు.

దళితులపై దాడులను అరికట్టాలి


ప్రజాశక్తి - పాలకొల్లు

భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 73 సంవత్సరాలైనా దళితులపై దాడులు జరగడం సిగ్గుచేటని ఎస్సి కమిషన్ ఛైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ అన్నారు. పాలకొల్లు అంబేద్కర్ భవనంలో భారత రాజ్యాంగ పరిరక్షణ జయభేరి కార్యక్రమంలో శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశంలో బడుగు, బలహీన వర్గాలపై జరుగుతున్న దాడులను అరికట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కుల, మత భేదాలు పెరుగుతున్నాయని చెప్పారు. అంబేద్కర్ రాజ్యాంగం అమలు చేయడానికి అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని కోరారు.

కూరగాయల బండి అందజేత

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు 15వ వార్డుకు చెందిన ఉల్లి వీరన్న, భవాని దంపతులకు డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ కూరగాయల బండి అందించారు. వీరన్న అనారోగ్యానికి గురవడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమకు కూరగాయల బండి ఇప్పించాలని వారు కోరారు. దీంతో స్పందించిన యడ్ల తాతాజీ వారికి శుక్రవారం కూరగాయల బండిని అందించారు. ఈ సందర్భంగా తాతాజీ మాట్లాడుతూ వైఎస్.జగన్ తనకు స్ఫూర్తి అని, సమాజసేవతో పాటు ఇతర అవసరాలు కూడా తీర్చేలా ముఖ్యమంత్రి చూపిన మార్గంలోనే తాను నడుచుకుంటానని చెప్పారు. ఆళ్ళ భవాని, భవాని దంపతులు మాట్లాడుతూ తాతాజీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జోగాడ ఉమామహేశ్వరరావు, బెజ్జవరపు నాగరాజు, అడ్డాల నారయ్య, మద్దాల శ్రీను, గంటా నరేష్, పాలపర్తి కృపానాద్, పెచ్చెట్టి కృష్ణాజీ, పి.అప్పాజీ, భుజంగరావు, జాన్ విక్టర్, కిరణ్, మూర్తి, అనిశెట్టి శ్రీను, వెంకటేశ్వరరావు, బందారు బాబి, దుర్గారావు, నాని షణ్ముఖ్, పదాల జయబాబు, ఇంటి వివేక్, అభిషేక్, భీమవరపు శాంతి, బొర్రా బాలాజీ పాల్గొన్నారు.



కూరగాయల బండి అందిస్తున్న యడ్ల తాతాజీ

ఘనంగా పివిఎల్ పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి - ఉండి

వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు పుట్టినరోజు వేడుకలు శుక్రవారం ఉండి పిహెచ్‌సిలో ఉద్ధరాజు గాంధీ రాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పివిఎల్ పుట్టినరోజు సందర్భంగా కేకు కట్ చేశారు. వృద్ధులకు, రోగులకు, పేదలకు దుప్పట్లు, పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

పశు సంచార వాహనం ప్రారంభం

ప్రజాశక్తి - మొగల్తూరు

అత్యవసర సమయాల్లో పశువులకు వైద్య సేవలు అందించేందుకు పశు సంచార వాహనాలను ఏర్పాటు చేశామని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మండలంలోని కాళీపట్నంలో పశు సంచార వాహనాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో రెండో సంచార వాహనాన్ని మొగల్తూరు మండలంలో ప్రారంభించామని తెలిపారు.

వాయిదా చెల్లించలేదని ఫైనాన్స్ సిబ్బంది దాడి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఇంటిపై తీసుకున్న రుణం ఒక వాయిదా కట్టడం ఆలస్యం కావడంతో ఇంటికి వెళ్లి దౌర్జన్యానికి పాల్పడిన సంఘటన మండలంలోని రామన్నగూడెం గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు మిరియాల అన్నపూర్ణ రామన్నగూడెంలో ఆశా వర్కర్‌గా పనిచేస్తున్నారు. గత సంవత్సరం స్థానిక ఫైవ్ స్టార్ ఫైనాన్స్ ప్రయివేటు కంపెనీ వారు ఇంటిపై రూ.2.50 లక్షల రుణాన్ని తనకు రూ.రెండు లక్షలు మాత్రమే ఇచ్చి మిగిలిన రూ.50 వేలు ఫైనాన్స్ సిబ్బంది అంచనాలు తీసుకున్నట్లు అన్నపూర్ణ తెలిపారు. అనారోగ్యం కారణంగా ఒక నెల వాయిదా కట్టలేదని ముందుగానే చెప్పానని, అయినప్పటికీ ఫైవ్ స్టార్ ఫైనాన్స్ సిబ్బంది ఇంటికి వచ్చి తన తల్లి వీరమ్మ(65)పై దాడికి పాల్పడ్డారని మిరియాల అన్నపూర్ణ తెలిపారు. ఫైనాన్స్ సిబ్బంది దాడిలో గాయపడిన వీరమ్మను స్థానికులు 108 వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న వీరమ్మ వద్ద వివరాలు తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు. తను లేని సమయంలో ఇంటికి వచ్చి తన తల్లిపై దాడికి పాల్పడిన ఫైవ్ స్టార్ సిబ్బందిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

ఉండిలో పివిఎల్‌ను గెలిపించాలి

ఘనంగా నరసింహరాజు పుట్టినరోజు


కేక్ కట్ చేస్తున్న పివిఎల్ నరసింహరాజు

ప్రజాశక్తి - కాళ్ల

ఉండి నియోజకవర్గంలో పివిఎల్ నరసింహరాజును 2024 అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పౌర సరఫరాల శాఖా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. పెదఅమిరంలో డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు పుట్టినరోజు వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు, రాజ్యసభ సభ్యుడు బీదా మస్తాన్‌రావు, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, భీమవరం ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్, ఉంగుటూరు ఎంఎల్‌ఎ పుప్పాల వాసుబాబు, టిటిడి మాజీ సభ్యులు గోకరాజు రామరాజు, మాజీ ఎంఎల్‌ఎ పాతపాటి సర్రాజు, వానపల్లి బాబూరావు, జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ కార్యక్రమానికి విచ్చేసి పివిఎల్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడారు. టిడిపి కంచుకోట అయిన ఉండిలో వైసిపి జెండా ఎగురవేసేందుకు అందరు సమిష్టి కృషి చేయాలన్నారు. పివిఎల్ మాట్లాడారు. పార్టీ అధిష్టానం సూచన మేరకు అందరం కలిసికట్టుగా పనిచేయాలన్నారు. అలాగే మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, గోకరాజు రామరాజు, మాజీ ఎంఎల్‌ఎ పాతపాటి సర్రాజు నరసింహ రాజుకు గజమాల వేసి అభినందనలు తెలిపారు.

12వ వార్డులో సమస్యలు పరిష్కరించాలి : సిపిఎం

ప్రజాశక్తి - భీమవరం

పట్టణంలోని 12వ వార్డు వైఎస్ఆర్ కాలనీలో అనేక సమస్యలు నెలకొన్నాయని, సమస్యలు పరిష్కరించాలని సిపిఎం పట్టణ నాయకులు ఎం.వైకుంఠరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వైఎస్ఆర్ కాలనీలో సిపిఎం ఆధ్వర్యంలో సర్వే చేశామని, అనేక సమస్యలు తమ దృష్టికి వచ్చాయని తెలిపారు. ప్రధానంగా పెన్షన్లు, డ్రెయినేజీ, తాగునీటి పైపుల ద్వారా మురుగునీరు రావడం వంటి సమస్యలు ఉన్నాయని తెలిపారు. రేషన్ కార్డుల్లో భర్త పేరు తొలగించాలని డెత్ సర్టిఫికెట్ చూపించినా ఇంతవరకు భర్త పేరు తొలగించకపోవడంతో 11 నెలలు ఆగిపోయిందని మహిళ తమ దృష్టికి తీసుకొచ్చిందని తెలిపారు. ప్రభుత్వం కరెంట్ ఛార్జీలు పెంచుతూ ట్రూ ఆఫ్ ఛార్జీల పేరుతో కరెంట్ బిల్లు పెంచుతున్నారని విమర్శించారు. కరెంట్ బిల్లు ఎక్కువ వస్తే పెన్షన్ కట్ చేయడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వం లబ్ధిదారులకు నిలిపేసిన పెన్షన్లు వారికి అందించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

యువగళంకు సంఘీభావంగా టిడిపి ర్యాలీ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కుప్పంలో ప్రారంభించిన యువగళం పాదయాత్రకు సంఘీభావంగా టిడిపి నియోజకవర్గ తెలుగుయువత ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. లోకేష్ పాదయాత్ర విజయవంతం కావాలని మావుళ్లమ్మ ఆలయంలో చెరుకుపల్లి సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో 108 కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలుచేశారు. అనంతరం వీరమ్మచెరువు, బివిరాజ్ పార్కు వద్ద ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి మాట్లాడుతూ పాదయాత్రకు నేతలు తరలివెళ్లారని తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షుడు మామిడిశెట్టి ప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్ష కార్యదర్శులు రేవు వెంకన్న, కౌరు పృథ్వీశంకర్, ఐటిడిపి అధ్యక్షుడు బొడ్డు మోహన్ పాల్గొన్నారు.

పాలకొల్లు : నారా లోకేష్ చేపట్టిన పాదయాత్ర విజయవంతం కావాలని కోరుతూ టిడిపి ఎస్‌సి సెల్ నాయకులు శుక్రవారం శంభునిపేట చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. లోకేష్ పాదయాత్ర విజయవంతం కావాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి ఎసి సెల్ నేతలు దాసరి రత్నరాజు, పీతల శ్రీనివాస్, మాతా రత్నంరాజు పాల్గొన్నారు.

'ఇదేం ఖర్మ రాష్ట్రానికి' మంచి స్పందన

ప్రజాశక్తి - ఆచంట

రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు టిడిపి చేపట్టిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమానికి ప్రజల్లో మంచి స్పందన లభిస్తోందని టిడిపి సీనియర్ నాయకులు గొడవర్తి శ్రీరాములు అన్నారు. శుక్రవారం గ్రామాల్లో టిడిపి కార్యకర్తలు, కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ పాలనలో అన్ని వర్గాలవారికీ నష్టం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి తమ్మినీడి పృథ్వీకుమార్, నెక్కంటి ప్రభాకర్, దేవిరెడ్డి ఆంజనేయులు, కేతా మురళి పాల్గొన్నారు.

12న చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కార్యవర్గ సమావేశం

ప్రజాశక్తి - పెనుమంట్ర

జాతీయ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కార్యవర్గ సమావేశం వచ్చే నెల 12వ తేదీన కడప జిల్లాలోని బస్టాండ్ ఎదురుగా ఉన్న ప్రెస్ క్లబ్‌లో జరుగుతుందని మార్టేరుకు చెందిన జాతీయ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అల్లాడ సూర్య భాస్కరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభ అధ్యక్షుడు, జాతీయ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు నీలూరి రుషింగప్ప ఆదేశాల మేరకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముఖ్య అతిథిగా జాతీయ చేనేత ఐక్యవేదిక జాతీయ కన్వీనర్ అవ్వారు మల్లికార్జున హాజరుకానున్నారని తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొంటారని తెలిపారు.


మధ్యాహ్న భోజనాన్ని రుచి చూస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మెస్ ఛార్జీలు పెంచాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - పెనుమంట్ర

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి పెంచిన మెస్ ఛార్జీలు వెంటనే అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పి.వాసు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెనుమంట్ర జిల్లా పరిషత్ హైస్కూల్‌ను శుక్రవారం ఎస్ఎఫ్ఐ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు పాఠశాలలో మధ్యాహ్న భోజనం ఏ విధంగా వండుతున్నారో అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు మెస్ ఛార్జీలను పెంచి సుమారు నాలుగు నెలలైనా ఇప్పటికీ అమలు చేయడం లేదని విమర్శించారు. వెంటనే పెంచిన మెస్ ఛార్జీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కె.మణికంఠ, పి.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజల ఆర్థికాభివృద్ధే లక్ష్యం : ఎంఎల్ఎ గ్రంధి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదిగితేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని భావించి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు రూపొందించి అమలు చేస్తున్నారని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. యనమదుర్రు పంచాయతీ పరిధిలో డేగాపురంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎంఎల్ఎ ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయో లేదో ఆరా తీశారు. గ్రామంలో సచివాలయం, విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్లను నిర్మించి అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ముఖ్యమంత్రి సమస్యలు లేని గ్రామాలే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారన్నారు. నియోజకవర్గంలో పేదల ఇళ్ల కోసం 300 ఎకరాలు సమీకరించి, 15 వేల మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేశామని తెలిపారు. అనంతరం కొత్తగా మంజూరైన రేషన్‌కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో డిసిఎంఎస్ ఛైర్మన్ వెంక్ర వెంకటస్వామి, ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహరాజు, జెడ్‌పిటిసి సభ్యులు కాండ్రేగుల నరసింహారావు, గూడూరి ఉమాబాల పాల్గొన్నారు.

'లోకేష్ పాదయాత్రపై ప్రజలకు ఆసక్తి లేదు'

ప్రజాశక్తి - పాలకొల్లు

లోకేష్ పాదయాత్రపై ప్రజలకు ఆసక్తి లేదని డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ అన్నారు. ఆయన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నారా లోకేష్ పాదయాత్ర అడ్డుకునేందుకు వైసిపి తీవ్ర ప్రయత్నం చేస్తోందని టిడిపి నేతలు విమర్శలు చేస్తున్నారన్నారు. అతను కనీసం ఎంఎల్ఎగా కూడా విజయం సాధించలేదని, అటువంటి వ్యక్తిని తాము ఎందుకు అడ్డుకుంటామన్నారు. ఈ సమావేశంలో జోగాడ ఉమామహేశ్వరరావు, బెజ్జవరపు నాగరాజు, జోగి వడ్డి కాసులు, చెన్ను విజయ్, గంటా నరేష్, రేలంగి శ్రీను, పెచ్చెట్టి కృష్ణాజీ, అడ్డాల నారయ్య, దిద్దె చిట్టిబాబు, కృష్ణమోహన్, చోదగిరి రమేష్ బాబు, హరికృష్ణ పాల్గొన్నారు

పందుల సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లులో పందుల సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. పాలకొల్లులో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వైరస్‌తో రోజుకు 30కి పైగా పందులు చనిపోతున్నాయని ఈ నెల 25న ప్రజాశక్తిలో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. పురపాలక సంఘం కమిషనర్ టిఆర్ఎస్.శేషాద్రి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. పందుల యజమానులు పందులను వారి గూడారాలకు తరలించారు. మళ్లీ ఈ సమస్య పునరావృతం కాకుండా చూడాలని పాలకొల్లు పట్టణ వాసులు కోరుతున్నారు.

తహశీల్దార్‌కు సత్కారం

ప్రజాశక్తి - అత్తిలి

కలెక్టర్ చేతులమీదుగా ఉత్తమ అవార్డు అందుకున్న అత్తిలి తహశీల్దార్ ఎవి.రామాంజనేయులును విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్ సంఘం శుక్రవారం సన్మానం చేశారు. ఈ కార్యక్రమానికి భీమవరం డివిజన్ ప్రెసిడెంట్ బివిఎవి పండు హాజరయ్యారు. ఈ సన్మాన కార్యక్రమంలో మండల ప్రెసిడెంట్ లంకపల్లి శ్రీకాంత్, వైస్ ప్రెసిడెంట్ రాపాక ఏసురత్నం, కార్యదర్శి తానుకొండ జాన్ మోసే, కోశాధికారి టి.లక్ష్మి, మండలంలోని విఆర్ఎలు అడపా బుల్లబ్బాయి, కె.నారాయణరావు, దుర్గ, వేడంగి సీనయ్య, దిగమర్తి కృష్ణమూర్తి, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

బిజెపిది మతోన్మాద పాలన

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఈ నెల 25, 26 తేదీల్లో కాకినాడలో ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర ద్వితీయ మహాసభ ఘనంగా నిర్వహించారని ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర ఉపాధ్యక్షులు లంక కృష్ణమూర్తి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ ఆలిండియా ప్రధాన కార్యదర్శి దేవబ్రత బిశ్వాస్, ఆలిండియా కార్యదర్శి జ్యోతిరంజన్ మహాపాత్ర హాజరై మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం మతోన్మాదంతోనే పరిపాలిస్తుందని, ప్రజా వ్యతిరేక పరిపాలన చేస్తుందని విమర్శించారు.

ఆక్వా రైతులకు బిఎంఆర్ భరోసా

ప్రజాశక్తి - ఉండి

ఆక్వా రంగంలో ఆర్థిక సంక్షోభం ఉత్పన్నమైన దృష్ట్యా మేత ధరలు విపరీతంగా పెరిగాయని రాజ్యసభ సభ్యులు, బిఎంఆర్ గ్రూప్ అధినేత బీదా మస్తాన్‌రావు అన్నారు. మండలంలోని వాండ్రంలో ఆక్వా రైతుల సంక్షేమ అసోసియేషన్ హాలులో శుక్రవారం ఆక్వా రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీదా మస్తాన్‌రావు మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించాలనే ఉద్దేశంతో హింటర్ టెక్నాలజీతో 30 శాతం ప్రోటీన్లు కలిగిన నూతన ఉత్పత్తిని మార్కెట్‌లోకి ప్రవేశ పెట్టామన్నారు. బిఎంఆర్ భరోసా నూతన ఉత్పత్తి ఆక్వా ఫీడ్‌ను ఆవిష్కరించారు. బిఎంఆర్ మేత రూ.69కే రైతు భరోసా కేంద్రాల్లో లభించేలా రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరపడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన తెలిపారు.

కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఎట్‌హోమ్

ప్రజాశక్తి -భీమవరం

ఉదయం నుంచి ఉద్యోగ విధుల్లో నిమగ్నమవుతున్న జిల్లా అధికారులందరూ సాయంత్రం పూట సరదాగా కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని, దీనిలో భాగంగానే ఎట్ హోమ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో గురువారం రాత్రి ఎట్‌హోమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమనికి జిల్లా అధికారులు కుటుంబ సభ్యులతో కలిసి హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ దంపతులు ప్రశాంతి, డిల్లిరావులు అతిథులను సాదారంగా ఆహ్వానించి ప్రతి ఒక్క అధికారిని ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీ కార్యక్రమాల్లో జిల్లా అధికారులు రెండు టీములుగా ఏర్పడి పాల్గొన్నారు. అనంతరం నృత్య కార్యక్రమాలు, పాటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి రవిప్రకాష్, జిల్లా జాయింట్ కలెక్టర్ జెవి.మురళి, నరసాపురం సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ, జిల్లా ఇన్‌ఛార్జి రెవెన్యూ అధికారి దాసి రాజు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న కలెక్టర్ దంపతులు

సురక్షిత ప్రయాణానికి చిరునామాగా ఆర్‌టిసి

భీమవరం రూరల్ : ఆర్‌టిసి సురక్షిత ప్రయాణానికి చిరునామాగా అందరి మన్ననలు అందుకుంటోందని పలువురు వక్తలు అన్నారు. 34వ రోడ్డు భద్రతా వారోత్సవాల ప్రారంభోత్సవ సభను భీమవరం ఆర్‌టిసి గ్యారేజీలో శుక్రవారం ఎస్.గిరిధర్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డిఎస్‌పి బి.శ్రీనాథ్ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. అనంతరం 21 నుంచి 31 సంవత్సరాల సీని యార్టీ కలిగి ఎటువంటి రోడ్డు ప్రమాదం జరగకుండా ఆర్‌టిసి బస్సు లు నడిపిన ఐదుగురికి ఉత్తమ డ్రైవర్ల సర్టిఫికెట్స్ అందించారు.

3 నుంచి వంతులవారీ విధానంలో సాగునీరు సరఫరా

ప్రజాశక్తి - పెనుమంట్ర

దాళ్వా వరి సాగులో ఫసలి 1432 గోదావరి పశ్చిమ డెల్టా జి అండ్ వి కాలువపై వంతుల వారీ విధానం షెడ్యూల్‌ను శుక్రవారం పెనుమంట్ర ఇరిగేషన్ ఎఇ బివివి.సత్యనారాయణ తెలిపారు. మండలంలోని సోమరాజు ఇల్లింద్రపర్రు, మల్లిపూడి, జుత్తిగ, పెనుమంట్ర, భట్లమాగుటూరు, పొలమూరు, మాముడూరు గ్రామాలకు సంబంధించి 9622 ఎకరాల ఆయకట్టుకు వంతుల వారీ విధానం ఫిబ్రవరి మూడో తేదీ నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు.

ఘనంగా ఎలక్ట్రీషియన్ డే

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఎలక్ట్రీషియన్ డే పురస్కరించుకుని భీమవరం నవ చైతన్య ఎలక్ట్రికల్ వర్కర్స్ అండ్ ప్లంబర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భీమవరంలో శుక్రవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మెంటేవారితోటలోని సిపిఎం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కుమార్ ఎలక్ట్రికల్ అండ్ శానిటరీషాపు అధినేత ప్రమోద్, అంబికా ఎలక్ట్రానిక్స్ అధినేత మహేందర్, జై భవాని ఎలక్ట్రికల్ అధినేత చేతన్, శివశ్రీ ఎలక్ట్రికల్ అండ్ ప్లంబింగ్ అధినేత కె.దుర్గారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలక్ట్రికల్ ప్లంబింగ్ వర్కర్స్ ఎదుర్కొనే సమస్యలు తమకు తెలుసని, వారికి ఎటువంటి సహాయ సహకారాలు అవసరమైనా ఎప్పుడూ అందుబాటులో ఉంటామని చెప్పారు. అనంతరం పలువురిని సన్మానించారు.

కంచుమర్రులో 'పొలంబడి'

టత్తిలి : మండలంలోని కంచుమర్రులో శుక్రవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ రాజేష్ మాట్లాడుతూ రైతులు ఎకరానికి 36 కేజీల భాస్వరం ఇచ్చే ఎరువులు మాత్రమే వినియోగించాలన్నారు. ప్రతి మూడు పంటలకు ఒకసారి జింకు లోపాన్ని సరి చేసుకోవడానికి ఎకరానికి 20 కేజీలు జింక్ సల్ఫేట్ దమ్ములా వేసుకోవాలని చెప్పారు. జింకు లోపం కనిపించిన చేలో చిలేటిక్ జింక్ ఎకరానికి ఒక లీటర్ నీటికీ రెండు గ్రాములు ఒక వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేసుకోవాలన్నారు.

IN THE COURT OF THE ADDL. SENIOR CIVIL JUDGE, ELURU
E.P.10/2019, O.S.55/2013

Between:
వేల్పుల వెంకటేశ్వరరావు ...D.Hr
And
దేవు నాగరాజు, S/o.రామారావు, విద్యుత్ నగర్ కాలనీ, వట్లూరు, పెదపాడు మండలం. ...J.Dr

వేలము నోటీసు

పై నంబరు దావా గ్రంథములోని D.Hr తన బాకీని వసూలు చేసుకునే నిమిత్తం దాఖలు చేసిన ఈ E.P గ్రంథములో దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్థిని **ది.20-02-2023 తేదీన ఉదయం 10.30 గం.లకు పై కోర్టు వారి ఎదుట బహిరంగముగా వేలం వేయబడును.** వేలంలో పాడుకొనదలచిన వారు ఉదయం 10.30 గం.లకు ఆధార్ కార్డులతో వచ్చి వేలంలో పాల్గొనదలచినదిగా కోర్టు వారు ఆర్డరు వేసియున్నారు.

షెడ్యూలు : Landed property in an extent of Ac.0-10 cts covered by R.S.No.114/3 situated in kolaparru Grama panchayat, pedapadu mandalam, Eluru SRO, W.G.Dt., wrthmi the following boundaries
East: Land of Kadaganchi Lakshmi
South: Land of Balda Manikyamma
West: Land of Ramini China Venkateswara Rao,
North: Land of Vare Veera Swamy.
An extent of Ac.0-10 cts of land, with all the easementary rights.
D.Hr Value - more than five lakhs
Amin Value - Rs.2,00,000/- to Rs.3,00,000/-
Eluru **S.Brahmam,** Advocate,
Dt.27-01-2023 Eluru. Cell: 94929 32214

మహారాజశ్రీ 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి, తణుకు వారి కోర్టులో
ఓ.యస్. నెం. 630/2021

బిట్వీన్:
నవ్య కృష్ణ ఇండస్ట్రీస్, పెనుగొండ రిప్రజెంటెడ్ బై ఇట్స్ ప్రొప్రయిటర్ పాచల పోతురాజు **-వాది**
మరియు
1. సూర్యరత్నం ఇండస్ట్రీస్, రిప్రజెంటెడ్ బై మేనేజింగ్ పార్టనర్, తటవర్తి ఎన్.వి.రామ్‌కుమార్, డోర్ నెం. 3-7-12/1, హోటల్ రత్న వద్ద.
2. తటవర్తి ఎన్.వి.రామ్‌కుమార్, తండ్రి: నాగేశ్వరరావు, మణీస్ ప్లాజా, 2వ ఫ్లోర్, మొహంతి వారి వీధి, భీమవరం-534202, భీమవరం మండలం, ప॥గో॥జిల్లా. భీమవరం అదనపు జిల్లా జడ్జి కోర్టు పరిధి. **-ప్రతివాదులు**

వాది తరపున దాఖలు చేసిన ప్రకటన

పై నెంబరు దావా, వాది ఖాతా పుస్తకాలలో ప్రతివాదుల తాలూకూ బాకీ మరియూ వడ్డీ అనగా రూ. 2,85,540/-లు వసూలు నిమిత్తం దాఖలు చేయగా మీరు కావాలని దావా సమన్లు తీసుకోనందున శ్రీ కోర్టు వారు మీకు పేపరు ప్రకటన ద్వారా దావా సమన్లు జారీ చేయవలసినదిగా ఆర్డరు వేసినారు. కావున మీరు **06-02-2023వ తేదీన ఉదయం 10.30 గం॥లకు** శ్రీ కోర్టు వారి ఎదుట హాజరు కాని ఎడల మీ పరోక్షమునందు దావా విచారణ మరియు తీర్మానం జరుగునని ఇందుమూలంగా తమకు తెలియజేయడమైనది.

గోటేటి భాస్కరమూర్తి
తణుకు **గోటేటి సత్య వెంకట వరప్రసాద్**
ది.04-01-2023 అడ్వకేట్స్, తణుకు

మహారాజశ్రీ 4వ అదనపు జిల్లా జడ్జి, తణుకు వారి కోర్టులో
ఫైనల్ డిక్రీ ఐ.ఏ. నెం. 30/2022 ఇన్ ఓ.యస్. నెం. 33/2018

బిట్వీన్:
చింతా వెంకటలక్ష్మి **-పిటిషనర్/వాది**
మరియు
(1) కొవ్వూరి దయానిధి రెడ్డి
(2) నల్లిమిల్లి సుజాత
-రెస్పాండెంట్స్/ ప్రతివాదులు

పిటిషనర్/వాది తరపున దాఖలు చేసిన ప్రకటన
రెస్పాండెంట్/ప్రతివాది నెం.(1):
కొవ్వూరి దయానిధి రెడ్డి, తండ్రి: లేటు వెంకటరెడ్డి, డోర్ నెం. 1-21, మెయిన్‌రోడ్, వాటర్ టాంక్ వద్ద, నత్తారామేశ్వరం - 534124, పెనుమంట్ర మండలం, ప॥గో॥జిల్లా, తణుకు 4వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు.

పై నెంబరు పిటిషన్ ది. 01-10-2019 ప్రిలిమినరీ డిక్రీ ప్రకారం ఫైనల్ డిక్రీ పాస్ చేయమని కోరుచూ పిటిషనర్/వాది దాఖలు చేయగా, మీరు నోటీసులు అందుకొననందున శ్రీ కోర్టు వారు మీకు పేపరు ప్రకటన ద్వారా నోటీసులు జారీ చేయవలసినదిగా ఆర్డరు వేసినారు. కావున మీరు **10-02-2023వ తేదీన ఉదయం 10.30 గం॥లకు** శ్రీ కోర్టు వారి ఎదుట హాజరు అవ్వక తప్పిపోయిన ఎడల పై పిటిషన్ మీ పరోక్షమునందు విచారణ మరియు తీర్మానం జరుగునని ఇందుమూలంగా తమకు తెలియజేయడమైనది.

గోటేటి భాస్కరమూర్తి
తణుకు **గోటేటి సత్య వెంకట వరప్రసాద్**
ది.02-01-2023 అడ్వకేట్స్, తణుకు

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం 2nd అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P. 54/2022 in O.S. 408/2021

బిట్వీన్:
సింగం పట్టాబి ***...Decree Holder/ DHR***
మరియు
అయినపర్తి విమల
...Judgement Debtor/JDR

పై నెంబరు డిక్రీ బాకీగాను జడ్జిమెంట్ డెటార్ అయినపర్తి విమల తాలూకు దిగువ షెడ్యూలు దాఖల స్థిరాస్తి **ది. 17-2-2023 వాయిదా రోజున ఉదయం 10.30 ని॥** లగాయతు పై కోర్టులో వేలం వేయబడును. కావున కావలసినవారు పాట షరతులు తెలుసుకొని పాడుకొనవచ్చును.

షెడ్యూలు

పశ్చిమగోదావరి జిల్లా, తాడేపల్లిగూడెం సబ్ డి.లో చేరిన తాడేపల్లిగూడెం మండలంలోని అప్పారావుపేట రెవెన్యూలోని పంచాయితీ గల మోదుగగుంట గ్రామం తాలూకు రి.స. నెం. 430/25 రులో స.డోరు నెం. 1-2రుకు చేర్ని సుమారు చ॥గ॥ 168లో స్థలం, రేకుల షెడ్డు ఇల్లుకు హద్దులు.

తూర్పు: మెరిపో వీరయ్య గారి స్థలం - 34 అడుగులు. **దక్షిణం:** దిర్సిపో దానయ్య గారి స్థలం - 44.6 అడుగులు. **పడమర:** పంచాయితీ రోడ్డు - 34 అడుగులు. **ఉత్తరం:** దిర్సిపో దండియ్య గారి స్థలం - 44.6 అడుగులు.

యీ హద్దుల మధ్య చ॥గ॥ 168 స్థలం, రేకుల షెడ్డు ఇల్లున్నూ, అందలి రివాజు దారి మార్గములు, యావత్తు యీజుమెంటు హక్కులతో సహా సర్వమున్నూ.

డిక్రీ హోల్డర్ కిమ్మతు: రూ. 2,50,000/-
అమీన విలువ : రూ. 4,00,000/-

అద్దంకి విజయరత్నం, అడ్వకేట్
తాడేపల్లిగూడెం, సెల్: 9290188928